అంతర సాగు.. ఆదాయం బాగు


మామిడిలో విరగ కాసిన సపోటా చెట్టు


ప్రస్తుతం సాగులో ఉన్న బొప్పాయి


అంతర పంటగా సాగు చేసిన ఆకుకూరలు


విరగ కాసిన మునగ చెట్టు

- 1.10 సెంట్ల భూమిలో పలు రకాల పంటలు
- సేంద్రియ పద్ధతిలో పండిస్తున్న రైతు
- ఏడాదికి రూ.1.97 లక్షల ఆదాయం

తుని: పుడమిని నమ్ముకుని, కష్టపడి పని చేస్తే అధిక దిగుబడులు వస్తాయని రైతులు నమ్ముతారు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా తునికి చెందిన రైతు గండి వెంకటరమణను చెప్పవచ్చు. వెంకటరమణ జాతీయ రహదారిని ఆనుకుని 1.10 సెంట్లు భూమి ఉంది. ఇందులో ఎకరం పొలంలో మామిడి తోట ఉంది. 10 సెంట్ల భూమిలో బొప్పాయి సాగు చేశాడు. అంతర పంటగా ఆకుకూరలు వేశాడు. పంట వేసిన రోజు నుంచి అమ్మకం వరకూ అన్ని అతనే చేస్తున్నాడు. ఏడాదికి రూ.1.97 లక్షల నికర ఆదాయం తీస్తున్నాడు. ఇతను ఏడాది పొడవునా పంటల ద్వారా ఆదాయం పొందడం విశేషం. సాగుకు సంబంధించిన అవలంబిస్తున్న పద్ధతులను ఆయన మాటల్లోనే తెలుసుకుందాం.

మామిడిలో అంతర సాగు

ఎకరా భూమిలో మామిడి తోట ఉంది. దీనికి నాలుగు వైపులా వేర్వేరు రకాల ఉద్యాన పంటలను వేశాడు. మునగ, అరటి, నిమ్మ, బత్తాయి, సపోటా, ఉసిరి, జామ, కరివేపాకు తదితర రకాలు సాగు చేశాడు. మామిడి తోటలో అన్ని రకాల చెట్లు ఉన్నాయి. బంగినపల్లి, సువర్ణరేఖ, రసాలు, తోతాపురి, నీలం, కోలంగోవ, హైదరసాహెబ్, పందూరి తదితర రకాలు ఉన్నాయి. నీటి సదుపాయం ఉండడంతో సేంద్రియ ఎరువులను చెట్లకు వేస్తున్నాడు. మామిడితో పాటు ఇతర రకాల ద్వారా అదనపు ఆదాయం సమకూరుతోంది.

బొప్పాయిలో అంతర పంటలు

బెంగళూరు నుంచి తీసుకువచ్చిన 100 బొప్పాయి మొక్కలను 10 సెంట్లలో సాగు చేశాడు. అంతర పంటగా కొత్తిమీర, చుక్కకూర, పాలకూర, మెంతుకూర, బంతితోట వేశాడు. బొప్పాయికి పశువుల గెత్తం, వేప, గోమాత మూత్రంతో తయారు చేసిన 4 లీటర్ల మిశ్రమాన్ని పిచికారీ చేసినట్టు తెలిపారు. విత్తనం నుంచి సస్యరక్షణ వరకూ రూ.15 వేలు పెట్టుబడి పెట్టగా బొప్పాయి అమ్మకం ద్వారా రూ.లక్ష, ఆకుకూరల ద్వారా 6 నెలలకు రూ.20 వేలు, మునగ రూ.10 వేలు, అరటి రూ.12 వేలు, సపోటా, ఉసిరి, నిమ్మ వెరసి రూ.5 వేలు ఆదాయం వచ్చింది. మామిడి తోట ద్వారా మరో రూ.50 వేల ఆదాయం వస్తుంది.

సొంతంగా సేద్యం

వెంకట రమణ కూలీలను పెట్టకుండా సొంతంగా పనులు చేస్తున్నాడు. బొప్పాయి మొక్కకు మొక్కకు మధ్య 6 అడుగుల దూరం ఉంచి మధ్యలో చిన్నపాటి సాళ్లు ఏర్పాటు చేసి అందులో ఆకుకూరలను వేశాడు. వీటికి సేంద్రియ ఎరువులను వేస్తున్నాడు. విత్తనాలను సొంతంగా తయారు చేసుకుని, మళ్లీ పంటకు వినియోగించుకుంటున్నట్టు ఆయన తెలిపారు. చేతికి వచ్చిన పంటను తుని మార్కెట్‌యార్డులో ఉన్న రైతు బజారుకు తీసుకు వెళ్లి అమ్ముతున్నాడు. 365 రోజులు మార్కెట్‌కు ఆకుకూరలను తీసుకువెళ్లి అమ్ముతున్నట్టు ఆయన తెలిపారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం



ఉన్న కొద్ది భూమిలో రకరకాల పంటల సాగు చేయడం ఆనందంగా ఉంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం తీస్తున్నాను. మామిడి నుంచి ఆకుకూరల వరకూ పెట్టుబడి పోను రూ.1.97 లక్షల ఆదాయం వస్తోంది. ఉదయం కూరలు అమ్మి, సాయంత్రం వ్యవసాయ పనులు చేస్తున్నాను. కూలీలను పెట్టాల్సిన అవసరం లేదు. చీడపీడలు వచ్చినప్పుడు ఉద్యానశాఖ అధికారి సూచనలు తీసుకుంటున్నాను. పంటల నుంచి వస్తున్న ఆదాయంతో ఆనందంగా జీవిస్తున్నాం.

–గండి వెంకట రమణ, రైతు

క్లుప్తంగా

ప్రజా ఫిర్యాదుల సేవా కేంద్రం ప్రారంభం


తునిలో ప్రజా ఫిర్యాదుల సేవా కేంద్రాన్ని ప్రారంభించిన కమిషనర్ వెంకట్రావు

తుని: పట్టణ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా ఫిర్యాదుల సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు తెలిపారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల సేవా కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ప్రజల తమ సమస్యలపై దరఖాస్తు రూపంలో ఫిర్యాదు చేస్తే ఆయా సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. డీఈఈ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు


తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

తుని: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను సోమవారం సాయంత్రం ఆమె పరామర్శించి పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. అనంతరం పోస్టాఫీసు వీధిలోని పాత మగ ఆసుపత్రి స్థలాన్ని పరిశీలించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైద్యారోగ్యశాఖ అధికారులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్ఫూర్తితో అన్నదానం


జగ్గంపేటలో అన్నదానం ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు ఆశయాలకు అనుగుణంగా ఏడాది కాలంగా జగ్గంపేటలో అన్నదానం నిర్వహిస్తున్నట్టు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. జగ్గంపేటలో సోమవారం ఆయన అన్నదానాన్ని ప్రారంభించారు. పేదలకు స్వయంగా వడ్డన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గంలోని 4 మండలాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రస్తుతానికి జగ్గంపేట, కిర్లంపూడి మండలాలకు అన్న క్యాంటీన్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


రాచపల్లిలో అవగాహన ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, అధికారులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఎంఈఓ వి.రాజబాబు ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ఐదేళ్లు నిండిన 10 మంది పిల్లలను స్థానిక ఎంపీపీ పాఠశాలలో చేర్పించారు. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను పాఠశాలల్లో, మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది జె.మంగాదేవి, ఎంపీ సత్యవతి, పీవీ సుబ్బులక్ష్మి, సీఆర్పీ సీహెచ్ రాజేష్, హెచ్‌ఎం ఎం.రాజబాబు, ఏఎన్‌ఎం సీహెచ్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

గొల్లప్రోలు: పట్టణంలో సోమవారం పాదాంబిక అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. గొల్లప్రోలు పట్టణంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పండితులు ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తిరుప్పావడ సేవా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పుష్పాలతో విశేష అలంకరణ చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జ్ డీఈ శివాజీ

తుని రూరల్: వాతావరణ మార్పుల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని గ్రామీణ తాగునీరు, పారిశుధ్య విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ఇన్‌చార్జ్ డీఈఈ ఎ.శివాజీ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ పి.రవికుమార్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, ఎస్.సూరవరం, తేటగుంట పీహెచ్‌సీ పరిధిలో వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ డీఈఈ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ విధిగా చేయాలని, తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలన్నారు. కలుషిత నీటి నిల్వలు లేకుండా వారానికి ఒకరోజు డ్రైడే పాటించాలన్నారు. వైద్యుల పర్యవేక్షణలో ఇంటింటా సర్వేలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీఓ రవికుమార్ సూచించారు. డయేరియా, మలేరియా, డెంగీ వంటి విష జ్వరాలను సకాలంలో గుర్తించాలన్నారు. ఆస్పత్రులకు వచ్చే అనుమానిత రోగులకు రక్త పరీక్షలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తేటగుంట పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.సుస్మిత, ఈఓపీఆర్‌డీ ఎస్.జయరామ్, ఏఓ ఎంఎస్‌వీఎస్ శేషగిరి, ఏఎన్‌ఎంలు, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు ఐదు దరఖాస్తులు


తుని గ్రీవెన్స్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ భరత్‌రెడ్డి

తుని రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రోసెల్ సిస్టమ్) కార్యక్రమానికి ఐదు దరఖాస్తులు అందినట్టు తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి తెలిపారు. నూతన ప్రభుత్వ ఆదేశాల మేరకు మొదటసారిగా సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలు వరకూ తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. వివిధశాఖల అధికారులు పాల్గొనాల్సి ఉన్నప్పటికీ రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన, హౌసింగ్, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులే హాజరయ్యారు. ఆరోగ్యశ్రీ కార్డులు జారీ చేయాలని ఇద్దరు, ఏఎస్‌డబ్ల్యూఓ హాస్టర్ అద్దె చెల్లించాలని, ఇంటి స్థలం సరిహద్దు సమస్య పరిష్కరించాలని, నివాస ధ్రువపత్రం జారీ చేయాలని ఫిర్యాదులు అందినట్టు తహసీల్దార్ భరత్‌రెడ్డి తెలిపారు. ఆయా సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఏఓ అశోక్ కుమార్, హెచ్‌ఓ జి.విజయలక్ష్మి, హౌసింగ్ ఏఈ ఎం.నాయుడు, డీటీ ప్రదీప్ పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

గోకవరం: మండలంలోని కొత్తపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో స్త్రీల కోసం నిర్మించిన మరుగుదొడ్డి ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు నున్నం రాంబాబు డిమాండ్ చేశారు. సుమారు 15 సంవత్సరాల క్రితం కొత్తపల్లి బస్టాండ్‌లో బావిని ఆనుకుని స్త్రీల కోసం మరుగుదొడ్డి నిర్మించారన్నారు. కొన్నేళ్ల క్రితం ఈ మరుగుదొడ్డి శిథిలావస్థకు చేరడంతో ప్రజావిరాళంతో పునర్నిర్మించినట్టు చెప్పారు. కాగా ఏడాది కాలంగా బస్టాండ్ సమీపంలోని బట్టల షాపు యజమాని ఈ మరుగుదొడ్డిలోకి ఎవరూ వెళ్లకుండా రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు అడ్డుపెట్టడంతో పాటు మరుగుదొడ్లలో కోళ్లు, మోటారు బిగించుకుని ఆక్రమించుకున్నాడని ఆరోపించారు. సుమారు 40 గ్రామాల నుంచి మహిళా ప్రయాణికులు ఇక్కడికి బస్సు ఎక్కడానికి వస్తుంటారని, మరుగుదొడ్డి ఆక్రమణకు గురికావడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై గ్రీవెన్స్‌లో ఎంపీడీఓకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులకు వరి విత్తనాల పంపిణీ


ఏలేశ్వరంలో రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఏఓ జ్యోతి, ప్రజాప్రతినిధులు


శంఖవరంలో రైతులకు విత్తనాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఏలేశ్వరం: ఖరీఫ్ సాగు చేసే రైతులు విత్తనాల్లో మొలకశాతం గుర్తించాలని మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు సోమవారం వరివిత్తనాలు పంపిణీ చేశారు. మండలంలోని ఏలేశ్వరం, తిరుమాలి, పెద్దనాపల్లి, మర్రివీడు, జె.అన్నవరం, తూర్పులక్ష్మీపురం, తదితర గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు వరివిత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు ప్రభుత్వం కేజీ విత్తనాలకు రూ.5 చొప్పున సబ్సిడీ అందిస్తోందన్నారు. రైతులు మొలక శాతం గుర్తించడంతో పాటు విత్తనశుద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మూది నారాయణస్వామి, బోద చిరంజీవిరావు, పాండ్రింకి అప్పారావు, పలివెల శ్రీను, బెల్లాని శ్రీను, రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాలు

రౌతులపూడి: మండలంలో రైతులకు సోమవారం సబ్సిడీపై వరి విత్తనాలను పంపిణీ చేశారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి విత్తనాలను అంజేసారు. ప్రభుత్వం సబ్సిడీపై అందించిన ఆర్‌జీఎల్ 2537, ఎంటీయూ–1064 రకాల వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఏఓ రెడ్డి ఈశ్వర్, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కర్‌రావు, టీడీపీ మండలాధ్యక్షుడు తమరాన సత్యనారాయణ, జట్ల రాజా, ఏఈఓ గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో..

శంఖవరం: రైతులకు అందుబాటులో విత్తనాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ తెలిపారు. మండలంలోని కత్తిపూడి, నెల్లిపూడి, జి.కొత్తపల్లి గ్రామాల్లోని విత్తనాల విక్రయ కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ గాంధీ మాట్లాడుతూ మండలానికి ఆర్‌జీఎల్ వరి విత్తనాలు 30 కిలోల బస్తాలు 133 వచ్చాయన్నారు. ఒక్కో బస్తా రూ.1,104కి విక్రయించనున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పర్వత సురేష్, వెన్నా శివ, బద్ది రామారావు, కీర్తి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో గ్రామాల్లో పర్యటిస్తా

మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత తోట నరసింహం


గుర్రంపాలెంలో పార్టీ నేతలను కలసిన తోట నరసింహం

జగ్గంపేట: నియోజకవర్గంలోని గ్రామాల్లో త్వరలో పర్యటించి పార్టీ నేతలు, కార్యకర్తలను కలుస్తానని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత తోట నరసింహం తెలిపారు. జగ్గంపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గుర్రంపాలెంలో అబ్బిరెడ్డి వీరబాబు ఆధ్వర్యంలో పర్యటించి పార్టీ నేతలు, కార్యకర్తలను కలిసినట్లు తెలిపారు. అన్ని గ్రామాల్లో పర్యటించేందుకు రూట్ మాప్ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయం కూల్చివేత ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో చాలా చోట్ల టీడీపీ కార్యాలయాలు అక్రమ కట్టడాలేనన్నారు. కాకినాడ జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయానికి అన్ని అనుమతులు ఉన్నాయా? అని ప్రశ్నించారు. కూటమి నేతలు కక్షసాధింపు వీడి ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు అత్తులూరి సాయిబాబు, చలగళ్ల దొరబాబు, గుల్లా ఏడుకొండలు, సుంకర వీరబాబు, దాసరి చిన్నబాబు, ఆడారి రాజబాబు, రామకుర్తి జగాల్, తులా రాము, మద్దిపాటి రామకృష్ణ, అడబాల సుబ్బారాయుడు, కరుటూరి వీర్రాజు, చీపురుపల్లి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సౌమ్య

ప్రత్తిపాడు: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య సూచించారు. స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో సోమవారం సీహెచ్‌సీ ఆవరణలో మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ గంజాయి, నల్లమందు వంటి మాదకద్రవ్యాలను వినియోగించడం వల్ల శరీరం నిర్జీవమై, జీవనం దెబ్బతింటుందని హెచ్చరించారు. కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమవుతుందన్నారు. మత్తు పదార్థాల వలన కలిగే అనార్థాలను వివరించారు. సెబ్ సీఐ చిరంజీవి మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా మత్తు పదార్థాల వినియోగం, క్రయ విక్రయాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

దళితులకు న్యాయం చేయాలంటూ ఆందోళన


కోటనందూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ (ఎంఎల్) నేతలు

కోటనందూరు: సాగుభూమి విషయంలో దళితులకు న్యాయం చేయాలని సీపీఐ (ఎంఎల్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ విజయ్‌కుమార్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని కేఈ చిన్నయ్యపాలెంలో 7.2 ఎకరాల భూమిని 30 సంవత్సరాలుగా దళితులు సాగు చేసుకుంటున్నారన్నారు. దీనిపై తుని కోర్టు సైతం దళితులకు అనుకూలంగా జడ్జిమెంట్ ఇచ్చిందని వినతిపత్రంలో పేర్కొన్నారు. గతంలో రెవెన్యూ అధికారులకు అర్జీ పెట్టుకున్నా పట్టించుకోలేదని, దళితుల హక్కులను నిర్ధారించి వారి పేర్లను సాగుబడిలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బైపా పర్సయ్య, ముప్పం నూకరాజు, గంటా ముత్యాలు, దారకొండ సంహాచలం, బొంకు ముసలి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు


కోదాడలో పారిశుధ్య పనులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

తొండంగి: మండలంలోని కొమ్మనాపల్లి, బెండపూడి గ్రామాల్లో డయేరియా ప్రబలిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. అన్ని గ్రామాల్లోనూ పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. కొమ్మనాపల్లి, బెండపూడి గ్రామాల్లో ఇప్పటివరకూ సుమారు 130 డయేరియా కేసులు నమోదు కాగా కొమ్మనాపల్లికి చెందిన ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వైద్యారోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ విభాగాల అధికారులు గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టారు. దీనిలో భాగంగా తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు, తాగునీటికి పరీక్షలు చేయడంతో పాటు పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నారు. కోదాడలో సర్పంచ్ బుర్తి రత్నకుమారి, బుర్తి నాని ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది డ్రైన్లలో పూడికతీత పనులు నిర్వహించారు. రోడ్లు, వీధులను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. గోపాలపట్నం, ఎ.కొత్తపల్లి, రావికంపాడు, శృంగవృక్షం తదితర గ్రామాల్లోనూ పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య పనులు చేపట్టారు. పరిసరాల పరిశుభ్రత, డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే గ్రామాల్లో నిల్వ మాంసం, నిల్వ చేపల విక్రయాలను నిషేధించారు.

మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీడీపీఓ ఝాన్సీరాణి

గోకవరం: మనుషుల అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యత అని కోరుకొండ ఐసీడీఎస్ సీడీపీఓ ఝాన్సీరాణి అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో సోమవారం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనుషుల అక్రమ రవాణా ప్రపంచంలోనే అతిపెద్ద నేరమన్నారు. ప్రతిరోజు ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు అక్రమ రవాణాకు గురతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ వరలక్ష్మి మాట్లాడుతూ మహిళల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా తమ సంస్థ గత 28 సంవత్సరాలుగా పోరాటం చేస్తోందన్నారు. ప్రస్తుతం యువత మొబైల్, ఇంటర్నెట్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కు గురవుతున్నారన్నారు. అక్రమ రవాణాకు గురైతే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజ్వల అసిస్టెంట్ కో ఆర్డినేటర్లు శివ, సుప్రియ అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేశ్వరరావు

కిర్లంపూడి: గ్రామాల పరిశుభ్రతే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా క్షేత్రస్థాయిలో పరిశుభ్రతపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రజలకు రక్షిత తాగునీరు అందించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటా ఫీవర్ సర్వే చేయాలని సూచించారు. ఎవరికైనా డయోరియా లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలకు పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎస్.సత్యప్రసాద్, వైద్యులు రాంబాబు నాయక్, రవికుమార్, అభిషేక్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

కొత్తపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ వెంకట నారాయణ అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పారిశుధ్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని సూచించారు. తాగునీటి పైపులైన్లకు లీకులు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై దృష్టి పెట్టాలన్నారు. డ్రైన్లలో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు.